# మరపురాని మగువ

రచన : 'జొన్నలగడ్డ'

ఆ టెలిగ్రాం చదివి నేను నిజంగా కంగారుపడ్డాను. చిరాకుపడ్డాను. కొంచెం భయపడ్డానేమో కూడా. అది ఢిల్లీనుంచి వచ్చింది. దానిలో క్వీన్స్‌రోడ్ పోస్టాఫీసునుంచి అది పంపబడినట్లుంది. మళ్ళీ చదివాను :

'ప్రభాత్ కుమార్.

కేర్ భారత్ లాడ్జి మద్రాసు-2.

మిస్. షీలాను ఏ పరిస్థితిలోను పెళ్ళాడవద్దు. అన్ని సంగతులు స్వయంగా చెబుతా. విమానంలో వస్తున్నా.

— మాలినీ జూనర్కర్.

ఈ టెలిగ్రాం చాలా అసంబద్ధంగా కనిపించింది. ఈ మాలినీ జూనర్కర్ ఎవరు? ఆమె పేరు నేను ఎన్నడూ వినివుండలేదే. పైగా ఎక్కడో ఢిల్లీలోవున్న ఆమెకు మద్రాసులోవున్న షీలా ఎలా తెలుసుకి షీలా, నేను పెళ్ళిచేసుకొంటున్న సంగతి మా యిద్దరి ఆంతరంగిక మిత్రులకే తెలియదే - ఆమెకెలా తెలుసు? తెలిసిందే అనుకొందాం. ఆమెకు అభ్యంతరమేమిటి? బహుశా షీలా యింతకుముందే వివాహిత అయి వుండడం దీనికి కారణమేమో - ఆ సంగతి తెలిసే నేను షీలాను పెళ్ళి చేసుకొంటున్నాను కదా! ఆమె భర్త శ్రీకాంత్ ద్వివేదీ మరణించి యింకా ఆరునెలలైనా కాలేదు. శ్రీకాంత్ ద్వివేదిని నేనుకూడా ఎరుగుదును. అతడు హఠాన్మరణం పొందాడు. షీలా బెంబేలుపడిపోయింది. ఆమె కంటికి మంటికి ఏకధారగా విలపించింది. నేను ఓదార్చాను. ఆమెకేమీ లోటురాకుండా చూస్తానన్నాను. నా ప్రాణమంతా ధారపోసి అయినా ఆమెను ఆజన్మాంత పోషిస్తానని వాగ్దానంచేశాను. అన్న ప్రకారమే ఆమెను ఆదరించాను. ఆమె పోషణకు తగువేర్పాట్లు చేశాను. తరుచు ఆమెను కలుసుకోసాగాను. ఆమె నాపైనే మరీ ఎక్కువగా ఆధారపడ్డది. ఒక్కక్షణం నేను ఆలస్యంగావస్తే విలవిలలాడి పోయేది. తన భావినిగురించి తాపత్రయ పడసాగేది.

'మీరు నన్ను ఇలా ఎంతకాలం కనిపెట్టుకు వుండగలరు? మీ పెద్దలు - మీ తలిదండ్రులకిది తెలిస్తే వారు అపోహ పడవచ్చును. మీకు పెళ్ళి చెయ్యవచ్చు. అప్పుడు నా బ్రతుకు తిరిగి అగాధంలో పడిపోక తప్పదు. నేను ఏదోవిధంగా ప్రాణం చాలించుకొనడమే గత్యంతరం' అంది.

నేను ఆమె చేతిలో చెయ్యివేసి ప్రమాణంచేశాను. ఎన్నటికీ వదలిపెట్టనన్నాను. శ్రీకాంత్ మీద గౌరవం వల్ల మాట్లాడలేక పోతున్నాను కాని, ఆమెకు అభ్యంతరం లేకపోతే వివాహమాడడానికైనా నేను తీయనన్నాను. ఆ మాట వినగానే దుఃఖాశ్రువసిక్తమైన ఆమె కళ్ళలో ఆనందజ్యోతి విరియజూసింది. ఆమె బుగ్గలు కెంపెక్కాయి. ఆ క్షణంనుంచీ ఆమెలో మార్పు కనిపించింది. సుందరమైన ఆమె ముఖమండలంలో అంతవరకు క్రమ్ముకొనివున్న నిరాశా మేఘాలు తొలగిపోయాయి. ఆ టెలిగ్రామును షీలాకు రాత్రి భోజనసమయంలో చూపిద్దామనుకొన్నాను. ఆ సాయంత్రం ప్లాజా సినిమాకు తీసుకువెళ్ళాను. ఆమె అంతం చూసి నేను ఆశ్చర్యపడ్డాను. తిరిగి ఆమెను యింటిదగ్గర దిగబెట్టాను. ఉదయం వస్తానని చెప్పి వెళ్ళిపోయాను.

ఆ మరునాటి ఉదయమే రిజిస్టర్ మారేజి చేసుకొనడానికి అంతకుముందే నిర్ణయించుకొన్నాం. ఆరాత్రే కొడైకనాల్ పోదామనుకొన్నాం. అనుకొన్నట్లె పెళ్ళిచేసుకొన్నాం. రిజిస్ట్రార్ ఆఫీసునుంచే సరాసరిగా టాక్సీలో మీనంబాకం విమానాశ్రయానికి వెళ్ళాం. ఎయర్ ఇండియా విమానంలో బెంగుళూరు వెళ్లాం. నియో ఆనంద్ భవన్‌లో బసచేశాం - ఆ రాత్రి నా జీవితంలో ఎన్నడూ మరపురాని ఆనందాను

భూతిని పొందాను. షీలా సౌందర్యమృతాన్ని తనివి తీరా గ్రోలినాను. ఆ సంతోషంలో ఢిల్లీనుంచి వచ్చిన టెలిగ్రాం మాటే మరిచిపోయాను.

మరునాటిఉదయం నేను గడ్డంగీసుకొంటున్నాను. షీలా యింకా మంచంమీద పడుకొనేవుంది. టెలిఫోన్ గణగణా మ్రోగింది. లేచి రిసీవర్ అందుకున్నాను, అటు వైపునుంచి కోమలమైన ఒక యువతికంఠం వినిపించింది మిస్టర్ ప్రభాత్‌కుమార్‌తో మాట్లాడాలంది, నేను - చెప్పండి అన్నాను.

'హల్లో! మిస్టర్ ప్రభాత్‌కుమార్! ఇటూ మాట్లాడుతున్నది మాలినీ జానర్కర్. మీకు నేను ఢిల్లీనుంచి టెలిగ్రాం యిచ్చాను. అందేవుంటుంది. ఈ హోటల్‌లోనే క్రిందవున్నాను. ఒకసారి దయవుంచి వస్తారా?

నేను నిర్విణ్ణుడనై పోయాను. షీలాను నేను పెళ్ళి చేసుకోకుండా వారించడానికి ఈమె ఢిల్లీనుంచి మద్రాసుకు, మద్రాసునుంచి బెంగుళూరుకు వచ్చింది. పెళ్ళి అయిపోయిన తర్వాతకూడా నన్ను వదలలేదు. ఏమిటీ విరుద్ధం అనుకొన్నాను.

"రాలేను క్షమించాలి. పైగా మీతో నేను చర్చించదగిన దేమీలేదు" అన్నా.

"అలాకాదు. ఒకసారి మీరు క్రిందకి రండి. చాలా జరూరైన సంగతి ఇది జీవన్మరణ సమస్య" అంది మిస్ మాలిని.

"ఊహుఁ! రాలేను" అన్నా.

"మీరు రాకపోతే నేనే మీ గదికివస్తాను. మిమ్మల్ని కలుసుకొని మాట్లాడకుండా నేను వెళ్ళబోయేది లేదు" అని తిరిగి వినిపించింది.

షీలా కళ్లు తెరిచి నా వంక చూసింది. ఆమె అధరాలపై మందహాసం మెరిసింది. నా హృదయం ఆనంద సాగరతరంగాల్లో తేలిపోయింది. కాని చేతిలో యింకా రిసీవర్ వుంది.

For FIRE, MOTOR, MARINE, ACCIDENT
FIDELITY GUARANTEE & EMPLOYERS, LIABILITY
INSURANCES

CONSULT

**United India Fire & General Insurance Co., Ltd.,**

"BOMBAY LIFE BUILDINGS"

**No. 9, BROADWAY :: MADRAS-1.**

*BRANCHES* :—**Throughout India & Far East**



SUNDAR DIAMOND WORKS
80. BIG CHETTY STREET., TIRUCHIRAPALLI-8

సుందర్ వజ్రములు అందరు వ్యాపారస్థులకు సరసమైన ధరలో పంపబడును.

ఉంగరాల కలరు వజ్రములు అన్నిరకములలోను దొరుకును.

ఒకసారి ప్రయత్నించి చూడండి.

సుందర్ డైమండ్ వర్క్సు
80. బిగ్ చెట్టి స్ట్రీటు తిరుచిరాపల్లి-8


"అయిదు నిమిషాల్లో వస్తున్నా" నన్నా.

"డార్లింగ్! ఫోన్‌లో పిలుస్తున్న దెవరు?" అంది షీలా.

"రిసెప్షన్ క్లర్కు మా ఆఫీసునుంచి ఏదో టెలిగ్రాం వచ్చిందన్నాడు. నువ్వు ఇంకా నిద్రపోతున్నావుగదా, "డిస్టర్బ" చెయ్యడం యిష్టంలేక నేనేవచ్చి తీసుకొంటానన్నాను. అయిదులేక పదినిమిషాల్లో వస్తాను. ఈ లోగా నువ్వు నీళ్లుపోసుకొని ఫలాహారాలు పైకి తెప్పించు. సరిగ్గా అయిదు నిమిషాలు" అన్నా.

ఆమె నావంక ఏమో ఆశాపూరిత నేత్రాలతో చూస్తూ దగ్గరకు రమ్మని సైగచేసింది. వెళ్ళి - దగ్గర కూర్చుని - బుగ్గలు పుణికి - "అయిదు నిమిషాల్లో వస్తానని. బ్రేక్‌ఫాస్ట్ రెడీ చెయ్యి" అంటూ లేచి లిఫ్టులో క్రిందకు వెళ్లా.

బహుశా ఏ యాభై ఏళ్ల మనిషో నామీద - షీలా మీద పగతీర్చుకోడానికి వచ్చివుందని - ఆమె ముఖం తోడేలు ముఖం లా వుండవచ్చునని అనుకున్నా కాని రిసెప్షనిస్టుకు ఎదురుగా కుర్చీలో 16, లేక 17 ఏళ్ల ప్రాయంమించని యువతి కూర్చునివుంది. నన్ను చూసి లేచిన - "నమస్తే శ్రీప్రభాతకుమార్ మీరే ననుకొంటా" నంది.

ఆమె షీలాకంటె చిన్నదని తోచింది. షీలా వయస్సు 24 ఏళ్లు. ఈమెకు 16, 17 ఏళ్ల ప్రాయం మించివుండదు. షీలా కంటె చాలా అందంగా వుంది.

"మీరు ఏం చెప్పదలచుకొని ఢిల్లీనుంచి యిక్కడకు పని కట్టుకు వచ్చారో నాకు తెలియదు. మీతో రెండు నిమిషాలకంటె ఎక్కువసేపు నేను మాట్లాడలేను." అన్నా.

"అసలు సంగతి తెలిశాక ఇరవై నిమిషాలదాకా మీరు నాతో మాట్లాడవచ్చు. ఎక్కడ కూర్చుని మాటాడదాం?" అంది మాలిని.

"నడుస్తూ మాట్లాడదాం రండి. దగ్గరలోనే లాల్‌బాగ్ వుంది." అన్నా.

"నేను అడిగే ప్రశ్నలు మీ భావిక ప్రాణానికి సంబంధించినవి కనక సదుత్తరాలివ్వండి. షీలాకు యిదివరలో పెళ్ళి అయిన సంగతి మీకు తెలుసుననుకొంటాను."

"బాగా తెలుసు, తెలిసే చేసుకొన్నాను, నిజానికి ఆమె భర్త శ్రీకాంత్ ద్వివేదీ, నేనూ కాలేజీలో సహాధ్యాయులం,"

"అంతకుముందు జరిగిన పెళ్ళి సంగతి?" అంది మాలిని.

"అంతకుముందే పెళ్లి అయింది" అన్న ప్రశ్న నా నోటినుంచి వెలువడింది.

"అవును. మా అన్నయ్య గోవిందరావు జనర్కాని పెళ్లి చేసుకొంది. ఎనిమిది నెల్లు కాపరం చేసింది. పిడుగులావుండే మా అన్నయ్య శ్రీకాంత్ ద్వివేదీలాగే నిగూఢ పరిస్థితిలో మరణించాడు."

"నిగూఢ పరిస్థితా?"

"కాక. శ్రీకాంత్ ద్వివేదీ హఠాన్మరణం పొందాడు. హార్ట్ ఎటాక్ (గుండెజబ్బు) అన్నారు. అలాగే మా అన్నయ్యా గుండెజబ్బువల్లనే మరణించాడన్నారు. నేను వెళ్ళేసరికే అంత్యక్రియలు పూర్తి అయినాయి. మా అన్నయ్యకు ముందుజరిగిన పెళ్ళిసంగతి కూడా మీకు తెలుసా? వైద్యనాథన్ అనే తమిళ సోదరుని పెళ్లాడింది. ఆయనకూడా గుండె జబ్బు మూలంగానే మృతి నొందాడట."

"అయితే షీలా యింతకుముందు ముగ్గురిని పెళ్ళి చేసుకొందా! ఇప్పుడు నామనస్సులో అనుమాన బీజం మొలకెత్తింది. శ్రీకాంత్ ద్వివేది మరణించిన నాటి సాయంకాలం అతనితో గంటసేపు మాట్లాడి వెళ్లాను, ఆ రాత్రే పన్నెండు గంటలకి అతడు మరణించాడు. నాకు వెంటనే నేను బసచేస్తున్న హోటల్‌కు ఫోన్ చేసే అవకాశం షీలాకు వున్నా నన్ను పిలవలేదు. మరునాటి ఉదయం పదిగంటలకు అతని మృతకళేబరం శ్మశాన వాటికకు యిక అయిదారు నిమిషాలలో పంపుతారనగా ఒక పనివాడిద్వారా కబురుచేసింది. నా హృదయం వడవడ కొట్టుకోసాగింది. అడుగుతీసి అడుగు వెయ్యలేక పోయాను. అప్పటికి మేము లాల్‌బాగ్ చేరుకొన్నాము.

"ఇలావచ్చి యిక్కడ కూర్చోండి" అంది మాలిని. కూర్చున్నాను.

"మా అన్నయ్య చనిపోయి యిప్పటికి ఏడాదిమీద ఒక మాసం దాటింది. అతడు అకస్మాత్తుగా మరణించాడని - అంత్యక్రియలు జరిగాక నాకు ఆమె టెలిగ్రాం యిచ్చినపుడే - నాకు ఎందుకో అనుమానం పట్టుకొంది. ప్రసిద్ధ డిటెక్టివ్ శ్రీ చంద్రమోహన్‌ను మా అన్నయ్య మరణకారణమేమో ఆ రాత్రి తెలుసుకోవలసిందని - ఈమె పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోమని కోరాను. ఆయన తన దర్యాప్తును పూర్తిచేసిన సమయంలోనే మీరు పెళ్ళిచేసుకోబోతున్న సంగతి తెలుసుకొని నాకు ఉత్తరం వ్రాశారు. అప్పుడే నేను మీకు టెలిగ్రాం యిచ్చాను, అయినా మీరు కనీసం రెండు రోజులు అగనైనా ఆగారు కారు."

"నాకు యిది అంతా అసంబద్ధంగా కనిపిస్తోంది. మీరు షీలా తన భర్తలను చంపివుండాలని సూచించగోరుతున్నట్లు కనిపిస్తుంది. అది పూర్తిగా అసంభవం."

"మీరు పొరపడుతున్నారు. ముగ్గురు భర్తలను షీలా హత్యచేసింది." అంది మాలిని నిశ్చలంగా.

నాకు అరికాలిమంట నెత్తికెక్కింది. చెంపప్రేలిపోయేటట్లు ఒక్కదెబ్బ కొడదామా అనుకొన్నా. ఆమెకేసి తీవ్రంగా చూశా. ఆమె చలించలేదు, నా కళ్ళలోకి చూస్తూ, "డిటెక్టివ్ చంద్రమోహన్ ఇవాళ సాయంత్రానికి యిక్కడికి వస్తారు. అన్ని వివరాలు నిదర్శనలతో మీకు చెప్పగలరు."

నేను యిక అక్కడ నిలబడలేదు. వెళ్ళిపోయాను.

తిరిగి సరాసరిగా హోటలుకు వెళ్లలేదు, అరగంట తిరిగాను. తలలో ఏదో వెర్రి ఆలోచనలు సినిమా దృశ్యాల్లా తలిరిపోతున్నాయి. రిస్టువాచీ చూశాను. ఏడున్నర అయింది. అయిదు నిమిషాలైంది.

తిరిగి హోటల్‌కు వెళ్లాను. ఆమె నా కోసం కాఫీ అయినా త్రాగకుండా వేచివుంది.

"ఇదేనా అయిదు నిమిషాలో రావడం?" అని అదోలా చూసింది, ఆ చూపు నా మనస్సుకు శాంతినిచ్చింది, ఆమాట అమృతంలా సోకింది.

"ఒకమైలు దూరం షికారువెళ్ళి వుండాలి. రండి. అన్ని చల్లారే పోయాయి." అంది.

ఫలహారాల ఆరగింపు ప్రారంభించగానే "టెలిగ్రాం "ఏదీ అంటే ఏమి చూపించను?

"టెలిగ్రాం నాకు కాదు. ఈ హోటల్లోనే బస చేస్తున్న ఒక బెంగాలీ ఆయనకు ఆయన పేరు ప్రభాత్ కుమార్ ముఖర్జి. పేరునుబట్టి అది నాకే అనుకొన్నాడు, ఆ గుమాస్తా" అని బొంకాను.

కాఫీ త్రాగాక - "ఒక్కమాట చెప్పాలను కొన్నాను. కాని నాకేబిడియంవేసి చెప్పలేదు. శ్రీకాంత్ జీకి ముందు నేను ఒకరిని పెళ్ళిచేసుకొన్నాను." గోవిందరావు జునర్కర్ అనే ఆయన్ని," అంది షీలా.

నా చేతిలోవున్న కాఫీ కప్పు క్రిందపడి పోయిందే అనుకొన్నాను.


గమనింపుడు! గమనింపుడు!

మీ మేలుకొరకు గమనింపుడు!!!




మీకు ఆకలి లేకున్నను, జీర్ణశక్తి లేకున్నను ఎముకలు మాత్రము తెలియుచుండునట్లు శరీరము కృశించియుండినను కన్నులు గుంటలు పడినను జ్ఞాపకశక్తి కొంచెమైనను లేకుండినను మలబద్ధము చేత బాధపడుచుండినను ధైర్యము చురుకుదనము లేకుండినను శుక్లము బొత్తిగా లేకుండినను మేహరోగముచేత పీడింపబడి యుండినను మా యొక్క "ఆనంద కుసుమాకర లేహ్యము" ను తెప్పించి పుచ్చుకొందురేని 6 వారములులోగా ఎటువంటి మహావ్యాధులనుండి తప్పించుకొని సౌఖ్యము పొందగలరు,

డబ్బి 1-కి రూ. 2-50

**మలయాళ మెడికల్ హాల్ (Regd)**

**పోస్టుబాక్సు నెం. 27**

**౧౮౯, వక్కీల్ కొత్తవీధి, మధురై.**

"అసంగతి నువ్వు నాకు చెప్పలేదే." అన్నా.

"ఏముఖంతో చెప్పను. చేసినదే తెలివి తక్కువపని-అప్పట్లో డబ్బులేక, దరిద్రంతో యమయాతన పడుతున్నాను. అత నెవరో కూడా సరిగా తెలియదు. ఎక్కడో ఒక స్నేహితురాలి ఇంట తారసపడ్డాను. ఆమె నా చిక్కుల్ని గురించి చెప్పింది. డబ్బిచ్చి ఆదరించాడు."

'ఆ తర్వాత ఏమైనాడో?'

'చనిపోయినాడు'

'నీకు అతని ఆస్తేమైనా కలిసివచ్చిందా? నేను అంతడబ్బున్నవాణ్ణి కాను.'

'ఆహా! పది పదిపన్నెండువేలు కలిసివచ్చింది. మీరు డబ్బులేనివాడని చెప్పనక్కరలేదు. మీ ఖర్చు - మీ షోకులు - మీ వేషంచూస్తే తెలుస్తుంది.' అంది షీలా.

శ్రీకాంత్ సంగతి నాకు తెలుసు. ఆమె నడగనక్కరలేదు. అతనికి డబ్బు నిలవెయ్యడం అంటే నమ్మకం లేదు. 15 వేలకు 20 వేలకు జీవితం జమచేశాడు. ఆ డబ్బు షీలాకు దక్కే వుంటుంది.

'అలా ఎక్కడికైనా పోయి వద్దామా!' అంది షీలా. సరేనన్నాను. బసవన్‌గుడి, మల్లేశ్వరం, కంటోన్మెంటు చూసి పన్నెండు గంటలకు తిరిగివచ్చాము. డైనింగ్ హాల్లోకి వెళ్ళి భోజనానికి కూర్చున్నాము,

ఇంతలోనే మిస్ మాలిని జునర్కర్ కూడా ఆ హాల్లోకే వచ్చి ఒక టేబుల్ దగ్గర కూర్చుంది. ఆమె వంక షీలా చూసింది. మాలిని 'హల్లో! షీలా క్షేమమా?' అంది.

'అవును.-ఆమె నాకు వదినె అవుతోంది. ఇప్పుడు చెప్పానే గోవిందరావుగారి మాట. ఆయన చెల్లెలు! అని ఆమె వంక తిరిగి మాలిని! ఈయన మావారు! అని పరిచయం చేసింది.

ఆమె 'నమస్తే అంది'. నేనుకూడా నమస్కారం అన్నాను.

'పెళ్ళి చేసుకొని "హనీమూన్"కు వచ్చారా అంది మాలిని.

షీలా తల వంకించింది. భోజనాలు పూర్తి కాగానే-'ఎప్పుడైనా కాస్సేపు కూర్చొని మాట్లాడుకొందాం' అంది షీలా మాలినితో. అంతే. నాతోపాటు మేడ మీదికి వచ్చింది. ఎప్పుడు మాట్లాడుకొనేది మాత్రం చెప్పలేదు.

కాస్సేపు ఆమె-నేనుకూడా నిద్రపోయాం. సాయంత్రం ముస్తాబైంది.

బట్టల కొట్లు చూసి వద్దామా? ఇక్కడ మంచి చీరలు దొరుకుతాయి' అంది షీలా.

వెళ్ళాము. కొన్ని చీరలు కొనుక్కుంది. కాని మా హృదయాల మధ్య-ఒకటికాదు మూడు భూతాలు నిలబడ్డాయి. మా హృదయాకాశాల్ని సందేహానుమాన మేఘాలు దట్టంగా కల్పుకొన్నాయి. ఆరాత్రి కొంచెం ఎడపెడి ముఖాలుగానే గడిచింది. ఉదయం యిక వుండబట్టలేక పోయింది కాబోలు.

'గోవిందరావు విషయం చెప్పలేదని మీకు కోపంగా వున్నట్లుంది. అదేమి గొప్పపనా అనుకొని చెప్పలేదు 'క్షమించండి' అంది. ఆమె కళ్ళనుంచి కన్నీరు కాలువలు పట్టింది. నా గుండె ద్రవించిపోయింది.

గోవిందరావుగారు బ్రతికివున్నప్పుడే మాలినికి నేనంటే కిట్టేదికాదు. ఆయన మరణానికి నా దురదృష్టమే కారణమని బాహటంగా నిందించింది. ఆ తర్వాత నేను మళ్ళి పెళ్ళాడడం ఆమెకు కోపకారణమైంది' అంది షీలా రుద్ధకంఠ స్వరంతో.

ఆమె చెప్పినది సహజంగానే వుంది. తన అన్న భార్య-ఒకరివెనుక ఒకరిని-ఇద్దర్ని పెళ్ళాడడం మాలినికి కష్టంగా తోచి వుండవచ్చు. ఇంతకు తనకుతానే గోవిందరావుతో పెళ్ళిమాట ఒప్పుకొన్నదయ్యే.

'ఇదిగో చూడు! నువ్వేం బాధపడనక్కరలేదు. నాకు కొంచెం తోచినమాట నిజమే. కాని నేను అదేమి పట్టించుకోను. ఇదిగో చూడు, మన పిల్ల అనగా




యెంపైర్ బనియన్లు, నాణ్యతకు మన్నికకు, అతి శ్రేష్ఠమయినది.

వివరములకు :

EMPIRE KNETTING CO., TIRUPUR. [S. I.]


మిస్ షాలిని కాకు ఈ టెలిగ్రాం యిచ్చింది. నేను నీకు చూపించనా?' అని జేబులోంచి టెలిగ్రాం తీసి చూపించాను.

'మనం యిక్కణ్నుంచి పోతే బాగుండును.' అంది షీలా.

'బొంబాయి పోదామా?' అన్నా.

'బొంబాయి అయినా సరే. కాశ్మీర్ అయినాసరే వెళ్ళిపోదాం. ఇక్కడ యిక ఒక క్షణంకూడా వుండ వద్దు.'

'సరే. ఢిల్లీ-విమాన ప్రయాణానికి టిక్కెట్లు కొని తెస్తా.'

'[illegible]గా వస్తానండి.' సరే రమ్మన్నాను. ఇద్దరం ఎయిర్ ఇండియా ఆఫీసుకు వెళ్ళి టిక్కెట్లు కొని తెచ్చుకొన్నాం. మరునాటి ఉదయం బయలుదేరి పోధామనుకొన్నాం. తిరిగి హోటల్‌కు వచ్చేసరికి లేంజిలో కూర్చున్న ఒక వ్యక్తి నన్ను చూసి-మిస్టర్ ప్రభాత్ కుమార్! అయిదు నిమిషాలు మీతో మాట్లాడాలి' అన్నాడు.

పది అడుగులు నా వెనకాలవున్న షీలా రాగానే, 'షీలా! పైకిపో! ఈయనతో అయిదు నిమిషాలు మాట్లాడి వస్తా' నన్నాను.

ఆయన నెవరండి?

'ఇన్సూరెన్సు ఏజంటు. ఈయన ద్వారానే నేను పదివేలకి ఇన్సూర్ చేశాను. ఇప్పుడు బెంగుళూరు బ్రాంచిలో వుంటున్నాడు.' అన్నా. ఆమె ఒకసారి నా వంక, ఒకసారి అతనివంక చూసి పైకివెళ్ళింది. ఆయ నెవరో నేను వెంటనే గ్రహించాను.

'డిటెక్టివ్ చంద్రమోహన్-?' అన్నా

'థాంక్స్. నేనే.'

'బయటకు పోదాం రండి - అర బయట కుర్చీలున్నాయి. ఒకచోట కూర్చుని మాట్లాడుకుందాం.' అన్నా.

కూర్చోగానే 'మీరు వివాహం చేసుకొన్న ఈ షీలా. యింతకుముందు ముగ్గురు భర్తలను చంపింది' అన్నాడు.

'ఆధారం?' అన్నా.

'వినండి. ఈమె పేరు రజని. పదిసంవత్సరాల క్రితం తిరుచిరాపల్లిలో వైద్యనాథన్ అనే సంపన్నుణ్ణి, వ్యాపారస్తుణ్ణి పెళ్ళాడింది. అది రిజిస్టర్డ్ మారేజి తనవయస్సు 24 అని చెప్పింది. తన స్వస్థానం ఢిల్లీ అంది. అయితే

యిప్పుడామె వయస్సు 34 ఏళ్లు అయివుండాలి. తన తండ్రిపేరు రాధాకమల్ హుబ్లికర్ అంది. తన తల్లిపేరు సావిత్రిబాయ్ అంది-అక్కడకువెళ్ళి దర్యాప్తుచేస్తే, అంతా అబద్ధమని తేలింది. వైద్యనాథన్ పాతికవేల భీమాచేశాడు. ఏడునెల్లు వీరు కాపరంచేశారు. హఠాత్తుగా అతడు మరణించాడు. గుండె జబ్బుఅని డాక్టర్ సర్టిఫికెట్ యిచ్చాడు.

'అతని ఆస్తి, ఇన్సూరెన్సు ఈమెకు కలిసివచ్చాయి, ఎనిమిది సంవత్సరాలవరకు ఈమె జాడ తెలియలేదు. బహుశా ఏపల్లెలలోపోయి గడిపివుంటుంది. ఇంకా ఎందరినో పెళ్ళిచేసుకొనుంటుంది. ఆ తర్వాత సుమారు పద్నాలుగు నెల్లక్రితం ఢిల్లీకి వచ్చింది, గోవిందరావు జానర్కర్‌ను చూసింది. అతనిదగ్గర సెక్రెటరీగా చేరింది. చేరిన రెన్నెల్లకే యిద్దరూ పెళ్ళిచేసుకొన్నారు ఎనిమిదినెల్లకు పిమ్మట అతడుకూడా ఆకస్మికంగా మృతినొందాడు. ఆస్తి, భీమాడబ్బు తీసుకొంది...

నేనన్నాను. అప్పుడు మద్రాసువచ్చి నా మిత్రుడు శ్రీకాంత్ ద్వివేదిని పెళ్ళిచేసుకొని, అతణ్ణి కడతేర్చి నన్ను పెళ్లాడింది. మీరు ఏడాదినుంచి ఈ పరిశోధన సాగిస్తున్నారు. దీనికి చాలా ఖర్చయివుండాలి. ఇంత డబ్బు మిస్ మాలినీ జానర్కర్‌కు ఎక్కడిది?' అని అడిగాను.

'ఆమె పెదతండ్రి రంగూన్‌లో వున్నాడు. ఆయన బ్రహ్మచారి. లక్ష రూపాయలదాకా సంపాదించాడు. ఆమెకు మిస్ మాలిని అంటే ప్రాణం. చనిపోవడానికి ముందు ఆ డబ్బంతా ఆమెకే చెందాలని వీలువ్రాశాడు. తన సోదరునికి ఏవిషమోయిచ్చి షిలాయే చంపిందని ఆమె అనుమానం.'

ఇంతలో మాలినీ జానర్కర్‌వచ్చి - 'అంతా చెప్పారా' అంది, నన్ను చూసి - 'మీకు జరిగిన నష్టాన్నిబట్టి మిమ్మల్ని హెచ్చరించాము. ఆమె నారీమణికాదు. నారీపిశాచి. మీ ప్రాణంకూడా తీస్తుంది. నమ్మితే నమ్మండి. మానితే మానండి. మేము పోతున్నాం.' అంది.



విశ్వరూపావారి చిత్రం 'కోరుకున్న అల్లు'డులో జగయ్య, రాజసులోచన.

నేను అక్కడ నిలబడలేక పోయాను. హోటల్ కు పరుగెత్తుకు వెళ్లాను. నాగదిలో చొరబడ్డాను. ప్రయాణానికి అన్ని సిద్ధం చేసింది షీలా. నేను మంచంమీద పడుకొన్నాను. నా తలను ఎవరో వెయ్యి సమ్మెటలతో బ్రద్దలు కొడుతున్నట్లుంది. దీపకాంతి చూసి భరించలేక-'దీపం ఆర్పివెయ్యి' అన్నా.

దీపం ఆర్పివేసి షీలా నాదగ్గరకు వచ్చి కూర్చుంది.

'నాకు తెలుసు. మీతో మాట్లాడినవ్యక్తి ఇన్సురెన్స్ ఏజంటుకాడు. మిస్‌మాలిని జానర్కర్ నియమించిన డిటెక్టివ్. నేను గోవిందరావుగారికి విషమిచ్చి చంపానని మీతో చెప్పివుంటాడు: అలాగే శ్రీకాంత్ ద్వివేది గారినికూడా చంపానని-వారి భీమా పట్టాల డబ్బు కనూలు చేసుకొన్నాననీ చెప్పివుంటాడు, అవునా?' అంది.

'అవును. వైద్యనాథన్ మాట?' అన్నా.

'వైద్యనాథన్ ఎవరు?'

'పదేళ్లక్రితం ట్రిచీలో నువ్వు పెళ్లాడినవాడు.'

'ఇదొకటా? వైద్యనాథన్-కాంతినాథన్-వడివేలు-ఏకుమలై-ఇంకా ఎంతమందిట?' అంటూ లైటుస్విచ్ ఆన్‌చేసి-తన సూట్ కేసులోంచి ఒక కవరు తీసుకువచ్చింది. అందులోని కాగితం తీసి నాకు యిచ్చింది. అది జనన సర్టిఫికెట్. 'నేను పుట్టినది. 1953-జూన్ 14 వ తేదీని. పదేళ్లక్రితం నాకు 14 ఏళ్లు. అప్పట్లో వైద్యనాథన్‌ను పెళ్ళి చేసుకోవడం - హత్యచెయ్యడం ఎలా పొంతనిస్తాయి. బెల్గాంలోని మోతిలాల్ స్ట్రీట్, 21 వ నెంబరు యింట్లో నేను పుట్టాను. కావలిస్తే అక్కడకు వెళ్ళి వాకబు చెయ్యండి. లేనిపోని అనుమానాలు పెట్టుకొని బాధపడేకంటె మనం ఈ క్షణంలో విడిపోవడం మంచిది. నేను నాదారిని పోతాను. నన్ను మీరు అవమానించడం ధర్మంకాదు.' అని నెత్తి నోరు బాదుకొంటూ వలవల ఏడ్చింది.

'నేను ఆ దృశ్యంచూసి భరించలేక పోయిను. లేచి దగ్గరగా లాక్కొన్నాను-'నేను ఎవళ్లు చెప్పినా నమ్మను. నా నీప్రేమను ఎవరూ భగ్నంచెయ్యలేరు.' అన్నా. దీపం ఆర్పివేసివచ్చి-ఆమె నా ప్రక్కనే పడుకొంది.

నేను కళ్లుమూసుకొని పడుకున్నాను. ఆ డిటెక్టివ్ చంద్రమోహన్ చెప్పినదీ - మాలిని చెప్పింది నా చెవుల్లో ఇంకా ప్రతిధ్వనిస్తోనేవుంది. కళ్లుమూతపడుతున్నాయి. ఒక కునుకు తీశానేమో కూడా. కాని మంచంమీదినుంచి షీలా లేవడంతో మెలుకువ వచ్చింది. అయిదు నిమిషాలైంది. ఇంకా రాలేదు. ఏదో కాలుతున్న వాసనసోకింది. నేను ఒకొక్కసారి కళ్ళు కొంచెం తెరిచిచూస్తు - మూసుకొంటూన్నాను తెరిచి గుర్రుపట్టినిద్రపోతున్నట్లు నటించి బాత్‌రూం తలుపు తెరిచి నట్లయింది. ఆమె మెల్లగా నా దగ్గరకు వచ్చింది, మంచంమీద కూర్చుంది. అప్పుడు ఆమె చేతిలోని చెంచా చూశాను. ఒక్క ఊపునలేచి, నా చేత్తో ఆమె చేతిని త్రోసివేశాను. ఆ స్పూన్‌లో సలసల క్రాగివున్న పదార్థం కొంచెం నా చేతిమీద చిందింది. అమ్మా అన్నా, ఒక దెబ్బ కొట్టా. ఆ చెంచా గోడమీద పడ్డది. ఆమె నామీద పడి - గోళ్ళతో నా ముఖం గీరసాగింది.

పిడికిలి బిగించి దవడ పగిలేటట్లు రెండు గుద్దా. ఘల్ళి చెయ్యేత్తే సరికి బాత్‌రూంలోకి పరుగెత్తి తలుపు బిగించుకొంది గోడదగ్గరపడ్డ చెంచాను చూశాను. తాకాను చుర్రుమనడంతో చెయ్యి వెనక్కు లాక్కున్నాను. అది కరిగించిన సీసం.

అప్పుడు బోధపడింది. కరిగించిన సీసం నిద్రపోతున్నపుడు నోట్లోపోస్తే - వెంటనే ప్రాణంపోతుంది. ఆ తర్వాత ఆ సీసం తొలగిస్తే ప్రమాదవశాత్తు గుండె ఆగిపోయి, మరణించారన్నా - ఏడాక్టరైనా - ఎవరైనా నమ్ముతారు. ఇది ఈమె చేస్తున్నది. అనుకొన్నా.

బాత్‌రూం తలుపు డబడబ బాదా. బదులులేదు. వరోక్షణానికి దభీమని క్రిందపడ్డ శబ్దమైంది. బహుశా ఏవిషమైనా తిందోఏమో.

పోలీసులు వచ్చారు, బాత్‌రూం తలుపులు బ్రద్దలు కొట్టి చూశారు. ఆమె మృతదేహం కనిపించింది.

ఆ తర్వాత బెల్గాం వెళ్ళి ఆమెచెప్పిన మోతిలాల్ స్ట్రీట్ చిరునామాకోసం చూస్తే - ఆ వీధి అక్కడ లేదు. నాకు చూపించినది దొంగ సర్టిఫికేట్ అయి వుండాలి.

ఇక ఆమె గతాన్ని గురించి ఇంకా దర్యాప్తు చెయ్యడానికి నేను బాధపడలేదు. కాని ఆమె చర్యనుమాత్రం ఎన్నటికైనా మరువగలనా?

(ఒక ఇంగ్లీష్ కథ ఆధారంగా)